

ఉపాధ్యాయుల ఎమ్మెల్సీగా మల్క కొమురయ్య 6

హార్ట్ బీట్..ఆగుతోంది 7
● ఆందోళనకు గురి చేస్తున్న గుండెపోటు మరణాలు

లింగ నిర్ధారణ పరీక్ష చట్టరీత్యా నేరం


గోడ ప్రతులను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో, వైద్యాధికారులు

గర్మిళ్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : లింగ నిర్ధారణ పరీక్ష చట్టరీత్య నేరమని, పరీక్ష చేయించిన వారు, చేసిన వారు, ప్రోత్సహించిన వారు శిక్షార్హులు అవుతారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి హరీష్‌రాజ్ అన్నారు. సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్ట రీత్య నేరమన్నారు. జిల్లాలో ప్రస్తుతం 52 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, ఇందులో 5 ప్రభుత్వ ఆధీనంలో, 47 ప్రైవేటు సెంటర్లు పనిచేస్తున్నాయని తలిపారు. స్కానింగ్ సెంటర్ల వైద్యుల వివరాలు, పరికరాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, స్కానింగ్ గదిలో ఎలాంటి ఫొటోలు ఉండకూడదని తెలిపారు. జిల్లాలో నూతనంగా 5 స్కానింగ్ సెంటర్లు అనుమతించామని తెలిపారు. ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే 9440586982 నెంబరులో సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. అనంతరం లింగ నిర్ధారణ పరీక్ష నిరోధం సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కృపాబాయి, పీవో ఎన్‌సీహెచ్ రాధిక, రాజ్ కిరణ్, అభినవ్, విక్రమ్, హీల్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఇబ్రహీం, రాంప్రసాద్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కాంతారావు, బుక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠాపన విజయవంతం చేయాలి

మందమర్రిటౌన్, మార్చి3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని త్రిశక్తి అష్టలక్ష్మీ, కామాక్ష్య అమ్మవారి ఆలయంలో మంగళవారం ఆయా విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలను విజయవంతం చేయాలని ఆలయ నిర్మాణ కర్త, ప్రధాన అర్చకులు సతీష్ భవాని తెలిపారు. సోమవారం ఆలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మూడు రోజులు ఈ నెల 4 నుంచి 6వరకు ఆలయ బ్రహ్మోత్సవాలు, విగ్రహాల ప్రతిష్ఠ ఉంటుందని తెలిపారు. హిందూ సనాతనధర్మాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆలయ నిర్మాణం చేపట్టి నాలుగేళ్లు పూర్తికావస్తుందని అన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో అమ్మవార్లను దర్శించుకునే భక్తులకు నిత్యాన్నదానంతో పాటు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేస్తున్నట్లు తెలిపారు.

రజక వృత్తిదారులను ఆదుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : రజక వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య అన్నారు. సోమవారం మంచిర్యాలోని చారువాక ట్రస్టు హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో లక్షలాది మంది రజక వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వారికి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలైన వృత్తిఆధునీకరణ, ఉపాధి కల్పన,మోడ్రన్ లాండ్రీల నిర్మాణం, రూ. 10 లక్షల ఆర్థిక సహకారం తదితర వాటిని వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడుఉ వెంకటేష్, నాయకులు రామచంద్రం, తిరుపతి, ఓదులు, చందర్, హన్మంతు, రాజేశ్వరి, భాగ్య, కళావతి, సమ్మయ్య, రమేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

భువన్ సర్వే పునః ప్రారంభం



- పట్టణాల్లో పక్కాగా ఆస్తుల వివరాల నమోదు
- 2020లో తొలిసారి ప్రారంభించిన అప్పటి ప్రభుత్వం
- అనివార్య కారణాల వల్ల అర్ధాంతరంగా నిలిచిన సర్వే
- మిగిలిన పని పూర్తి చేసేందుకు అధికారుల సన్నాహాలు

మంచిర్యాల, మార్చి3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణ, స్థానిక సంస్థల పరిధిలో ఆస్తుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేసేందుకు ప్రవేశపెట్టిన భువన్ సర్వే మళ్లీ ప్రారంభం కానుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన ఏర్పాట్లను చేస్తోంది. సర్వేలో భాగంగా ఉపగ్రహ ఆధారిత ఫొటోలు తీయడంతో పాటు ఆస్తి పన్నుకు సంబంధించి క్షేత్ర స్థాయిలో సిబ్బంది పర్యటించి వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. అసస్‌మెంట్ వాస్తవ విస్తీర్ణాన్ని గుర్తించి అందుకు అనుగుణంగా పన్ను విధించే వెసులుబాటు భువన్ సర్వేయాప్ ద్వారా కలుగనుంది. ప్రతి ఆస్తికి ప ది అంకెల ప్రాపర్టి టాక్స్ ఐడెంటిఫికేషన్ నెంబరు (పీటీ ఎన్) కేటాయిస్తారు. సర్వే కారణంగా ఆస్తులకు సం బంధించి ఏ మాత్రం తేడా లేకుండా సరిపడ పన్ను విధించేందుకు అవకాశం ఉంటుంది. తద్వారా యజమానులకు ఎక్కువ తక్కువ ఆస్తి పన్నులు నమోదు చేసేందుకు అవకాశం ఉండదు. దీని వల్ల ఆస్తికి సరిపడ ప న్ను చెల్లించాల్సి రావడంతో యజమానికి నష్టం కలిగే అవకాశాలు తొలగిపోతాయి.

అవకతవకలకు అడ్డుకట్ట...

రాష్ట్రంలోని పట్టణ, స్థానిక సంస్థలు ప్రతి సంవత్సరం దాదాపు రూ. 900కోట్ల ఆస్తి పన్ను వసూలు చేస్తున్నాయి. అయితే పన్ను విధింపులో అనేక అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. పలు ప్రాంతాల్లో యజమానులు స్థానిక సిబ్బందితో కుమ్మక్కై ఆస్తి విలువ, వైశాల్యం తక్కువగా చూపించడం ద్వారా ఆస్తిపన్నులో తగ్గింపులు జరుపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే వాణిజ్య పరమైన ఆస్తిని కొన్ని ప్రాంతాల్లో నివాస గృహాలుగా చూపించికూడ పన్ను తగ్గింపునకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మరోవైపు కొన్ని సందర్భాల్లో ఆస్తి విలువకు అదనంగా పన్ను విధి స్తున్న సందర్భాలు కూడ ఉన్నాయి. ఇలాంటి అవకత వకలకు చెక్‌పెట్టే ఉద్దేశ్యంతోనే ప్రతి ఆస్తిని ఉపగ్రహ ఆధారిత మ్యాపింగ్ చేయాలని తలపెట్టి 2020లోనే లాంఛనంగా రాష్ట్ర వ్యాప్తంగా సర్వేను అప్పటి ప్రభు త్వం ప్రారంభించింది.

నిలిచిన సర్వే...

ఇదిలా ఉండగా 2020లో ప్రారంభించిన భువన్ సర్వే కొంతకాలం పాటు సక్రమంగా సర్వే నిర్వహించినప్పటికీ అనివార్య కారణాల వల్ల అది పూర్తిగా నిలిచిపోయింది. కరోన కారణంగా దాదాపు రెండేళ్లపాటు సర్వే నిలిచిపో వడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. సర్వే ప్రారంభించిన కొత్తలో..

(తరువాయి 7లో)

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నస్పూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ 33/11 కేవి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ మల్లేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

దండేపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రాథమికస్థాయి నుంచే విద్యార్థులందరు క్రమశిక్షణతో చదువుకోవాలని రిటైర్డ్ ఉపాధ్యాయుడు కే ప్రసాద్‌రావు అన్నారు. దండేపల్లి మండలం జైతు గూడ టిడబ్ల్యూపిఎస్ గిరిజన పాఠశాలను సోమవారం ఆయన సందర్శించి విద్యా ప్రాముఖ్యత ఆవశ్యకత ముందుకు సాగాలని అనే అంశాలపై విద్యార్థులకు పాట రూపంలో వివరించారు. విద్యార్థులకు చదువుతోనే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులకు పాట రూపంలో డ్యాన్స్ రూపంలో వివరిస్తూ సామాజిక అంశాలపై వివరించి, వారికి పెన్నులు, చాక్లెట్లులను పంపిణీ చేశారు. అనంతరం అతనిని శాలువతో పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూక్య రూప్లా నాయక్, అంగన్‌వాడి టిచర్లు ఆడాయి జ్యోతి, కుడిమేత మీనాక్షి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురి కావద్దు

జైపూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : 10వతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే విద్యార్థులు ఒత్తిడికి గురి కావద్దని ప్రశాంతంగా పరీక్షలు రాయాలని జైపూర్ ఎస్ఐశ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గురుకుల సాంఘీక సంక్షేమ బాలుర పాఠశాలలో పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. పరీక్షలంటే భయంవద్దని, ఒక్కసారి పరీక్షలు తప్పిపోయినా మరల రాసి పాస్‌కావచ్చని తెలిపారు. దేశంలో ఎందరో ప్రముఖులు ఓటముల తర్వా తనే విజయాలు సాధించారన్నారు. ప్రతివిద్యార్థి సమయాన్ని వృథా చేసు కోకుండా చదువుకోవాలని, బట్టి విధానం మానివేసి క్లుప్తంగా అర్థం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని వినతి

లక్షెట్టిపేట, మార్చి3 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని ఊత్కూర్ చౌరస్తాతో పాటు కరీంనగర్ చౌరస్తాలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌షెల్టర్‌లను ఏర్పాటు చేయాలని కోరుతూ అంబేత్కర్ పట్టణ సంఘం ఆధ్వర్యంలో సభ్యులు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ కల్లెడ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. వేసవికాలం ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తక్షణమే స్పందించి షెల్టర్లను ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు తొగరి రాజు, సంఘం నాయకులు తిప్ప కుర్తి నారాయణ, మాలెం చిన్నయ్య, గొల్కొండ సత్తయ్య, అల్లంపల్లి రమేష్ పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి గెలుపు హర్షణీయం

గర్మిళ్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం బలపర్చిన బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపు హర్షణీయమని సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు శ్రీనివాసరావు, రవికుమార్‌లు పేర్కొన్నారు. సోమవారం మంచిర్యాలలోని సంఘం కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఈ గెలుపును ఉపాధ్యాయులగెలుపుగా భావిస్తున్నామని, అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న విద్యా రంగ సమస్యల సాధనకోసం ఉపాధ్యాయులు వారి అభిప్రాయాన్ని ఎన్నికల్లో ఓటు ద్వారా తెలియజేశారన్నారు. ఎమ్మెల్సీ సహకారంతో ఉపాధ్యాయుల పీఆర్సీ, పెండింగ్ డీఏ, బిల్లులు, సర్వీసు రూల్స్ తదితర సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు భారతిఅశోక్, నాయకులు రాజేశ్వర్, రమేష్‌కుమార్, శ్రీనివాస్, శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు

ఆధునిక సాంకేతిక కోర్సులు అందుబాటులోకి

ఐటీసీ భవన నిర్మాణ పనులు పరిశీలించిన కలెక్టర్

నస్పూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : అధునిక సాంకేతిక కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చి వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. నస్పూర్‌లో నిర్మాణంలో ఉన్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఐటీసీ) నిర్మాణ పనులను సోమవారం కలెక్టర్ కుమార్‌దీపక్ పరిశీలించారు. కొనసాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధునిక సాంకేతిక విద్యాప్రమాణాలను మరింతగా పెంపొందించి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. నేటి పోటీ ప్రపంచంలో సాంకేతికను విద్యార్థులకు అందిస్తామన్నారు. తద్వారా ఉపాధి అవకాశాలు మరింతగా మెరుగు పడుతాయన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్ : అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ల ద్వారా ఆధునిక సాంకేతిక విద్య అందిస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల పట్టణంలోని ఐటీఐ కళాశాల ప్రాంగణంలో కొనసాగుతున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల నిర్మాణ పనులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ సెంటర్ల ద్వారా నేటి పోటీ ప్రపంచంలోని సాంకేతికతను అభ్యర్థులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, అధికారులు పాల్గొన్నారు.


నస్పూర్‌లో ఐటీసీ భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

ఆర్థిక సంవత్సరం ముగింపు ప్రక్రియ పూర్తి చేయాలి

జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో బడ్జెట్ నిధుల వినియోగం తదితర సంబంధిత ఆర్థిక సంవత్సరం ముగింపు ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో ముఖ్య ప్రనాళిక అధికారి సత్యంతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల పరిధిలో కేటాయించిన అభ వృద్ధి పనుల నిర్వహణకు మంజూరైన నిధులు, ఖర్చుల వివరాలు, గుత్తేదారులకే కేటాయించిన పనుల వివరాలు, ఖర్చులు, జీఎస్టీ ఇతర పూర్తి వివరాలతో నివేదిక రూపొందించాలన్నారు. నిధులు పూర్తిస్థాయిలో ఖర్చు చేసి పనులు పూర్తయితే నిర్ధారణ చేసి 5 రోజుల్లోగా ధృవపత్రం సమర్పించాలన్నారు. జిల్లాలో చేపట్టిన సంక్షేమాభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులుపాల్గొన్నారు.

పంటల క్షేత్ర సందర్శన

చెన్నూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఓత్కులపల్లి గ్రామంలోని వరి , కర్బూ పంటల సాగును సోమవారం ఏడీఏ బానోతు ప్రసాద్ క్షేత్ర సందర్శన చేపట్టారు. వరిలో జింకు లోపం ఉందని, దీని నివారణకు జింక్ సల్ఫేట్ రెండు గ్రాములు లీటరు నీటికి పిచికారీ చేయాలన్నారు. అలాగే తెగుళ్ల నివారణకు కార్బండిజమ్, మాంకోజెబ్ మందును రెండు గ్రాములు లీటరు నీటికి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే కర్బూజాలో బోరాన్ లోపం ఉన్నట్లు గుర్తించి బోరాన్ ఒక గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు. రైతులు సేంద్రీయ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. ఆయన వెంట ఏఈవో సాగర్, రైతులు ఉన్నారు.


పంట సాగులో సూచనలు అందిస్తున్న ఏడీఏ

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- నిమిషం ఆలస్యమైనా సెంటర్‌లోకి అనుమతి లేదు
- ఉదయం 8గంటల నుంచి సెంటర్‌కు అనుమతి


పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

మంచిర్యాల క్రైం, మార్చి3 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల జరుగబోయే ఇంటర్ పరీక్షలకు విద్యాధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈనెల 5 నుంచి 25వరకు ఇంటర్‌పరీక్షలు జరుగనున్నాయి. ముఖ్యంగా ఒక్క నిమిషం నిబం ధన ప్రకారం 8గంటలకు ఒక్క నిమిషం లేట్ అయిన సెంటర్‌లోకి అనుమతించబడదు. విద్యార్థులు నిబంధనలను పాటించి సకాలంలో సెంటర్‌కు చేరుకోవాలి. విద్యార్థుల కోసం విద్యా శాఖ ఆదేశాల ప్రకారం ఆర్టీసీ అధికారులు బస్సులను ఏర్పాటు చేశారు. పరీక్షసమయంలో 166చట్టం అమలులో ఉంటుందని విద్యాధికారులు చెబుతున్నారు. ప్రతి విద్యార్థి షూస్ ధరించకుండా వస్తే మంచిది. షూలు వేసుకొని రావడంవల్ల చెకింగ్ సమయంలో ఇబ్బందులకు గురవుతారు. డిజిటల్ వాచ్‌లు నిషేధం. విద్యార్థినులు విలువైన బంగారు ఆభరణాలను ధరించకుండా వస్తే మంచిది. జిల్లా కేంద్రంలో మొత్తం ప్రథమ సంవత్సరం విద్యార్థులు 5900, రెండో సంవ త్సరం విద్యార్థులు 6640 మంది విద్యార్థులు ఒకేషనల్, జనరల్ పరీక్షలు రాసే విద్యార్థులు మొత్తం 12500 మంది ఉన్నారు. మంచిర్యాల, మంద మర్రి, చెన్నూర్, కాసిపేట, బెల్లంపల్లి, జైపూర్, జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట మొత్తం జోన్‌లకు గాను 23 సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతి సెంటర్‌లో మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. విద్యుత్, టాయిలెట్స్, తాగునీరు ఏర్పాటు చేయడంతో పాటు ప్రతిసెంటర్‌కు హాల్‌లో, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రతి 300మంది విద్యార్థులకు గాను 15 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో ఫ్లైయింగ్ స్క్వాడ్‌నుఏర్పాటు చేయడం చేశారు.. అందులో ఒక లెక్చరర్, డిఫ్యూటి తహసీల్దార్‌తో ఒక ఏఎస్ఐ ఉంటారు. జిల్లా మొత్తం లో వీరు తనిఖీలు చేస్తారు. వీరితో పాటు సీఎస్‌లు 23, డీఓలు 23మంది ఉంటారు. వీరితో పాటు రెండు సిట్టింగ్ స్క్వాడ్‌లు దీనిలో ఇద్దరు లెక్చరర్లు తనిఖీలు నిర్వహిస్తారు. వీరితో పాటు రెవెన్యూ సిబ్బంది కూడ ఎప్పటికప్పుడు పరీక్ష విధానాన్ని పరిశీలిస్తూ ఉంటారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి...



పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం చేశాం. విద్యార్థులకు మౌలిక సదుపాయాలతో పాటు సెంటర్‌లో క్లాస్ రూంలో కాకుండా బయట హాలులో, గేటు ముందు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాము. ఒక్క నిమిషం ఆలస్య నియమం వర్తిస్తుంది. 8గంటలకు విద్యార్థులను సెంటర్‌లోకి చేరుకోవాలి. విద్యా ర్థుల పరీక్ష విధానాన్ని ఎప్పటికప్పుడు ఇన్విజి లేటర్లతో పాటు ఫ్లైయింగ్ స్క్వాడ్ పర్యవేక్షిస్తుంది.

- ఇంటర్‌విద్యాధికారి అంజయ్య

కరాటే పోటీల్లో ప్రతిభ


కరాటే పోటీల్లో మెడల్స్ సాధించిన విద్యార్థులు

చెన్నూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మంచిర్యాలలోని ఎఫ్‌సీఐ ఫంక్షన్ హాలులో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో చెన్నూరు పట్టణంలోని శార్వాణీ ఇంగ్లీష్ మీడియం పాటశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రామగిరి స్నేహిత, జయదీప్‌రెడ్డి ప్రథమస్థానంలో నిలిచి గోల్డ్ మెడల్స్ సాధించారు. జాహ్నవి, సనాతని, సంజుక్త, శాన్విత, సుహానీ ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించినట్లు కరాటే మాస్టర్ రామగిరి స్వామి తెలిపారు. విద్యార్థులను కరెస్పాండెంట్ మేడ శ్రావణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

కుటుంబానికి ఆర్థిక చేయూత

మంచిర్యాల క్రైం, మార్చి3 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం తిలక్ నగర్‌కు చెందిన టీవీ మెకానిక్ ముడుసు లక్ష్మణ్‌కుటుంబానికి టీవీ మెకానిక్ టెక్నిషియన్ సంఘం సభ్యులు అతని కుటుంబానికి ఆర్థిక చేయూతగా రూ.24,500 అందజేశారు. లక్ష్మణ్ గుండెపోటుతో మృతి చెందడంతో చెక్కును అందించామన్నారు.

నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

వివరాలు వెల్లడించిన బెల్లంపల్లి ఏసీపీ

భీమిని, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మంచి ర్యాల జిల్లా భీమిని మండలంలోని మల్లీడి ప్రధాన రహదారిపై సోమవారం భీమిని పోలీసులు గ్లైసిల్ రకానికి చెందిన 2.74 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ భీమిని పోలీస్‌స్టేషన్ ఆవరణలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. నకిలీ పత్తి విత్తనాలను సరఫరా అవుతున్నాయనే పక్కా సమాచారంతో భీమిని పోలీసులు మల్లీడి క్రాస్ రోడ్ వద్ద వాహనాలను తనిఖీలు చేపట్టారు. దహగాం మండలంలోని అత్తిని గ్రామం నుంచి భీమిని మండలంలోని వడాల వైపు అక్రమంగా ద్విచక్రవాహనంపై సరఫరా చేస్తున్న 50కిలోల నిషేదిత గ్లైసిల్ 3వరకానికి చెందిన నకిలీ విత్తనాలను పోలీసులు పట్టుకున్నారు. అనంతరం నిందితులు తెలిపిన సమాచారం మేరకు దహగాం మండలంలోని కొత్త అత్తిని గ్రామంలో రాజన్న ఇంటి వద్ద 2క్వింటాళ్ల 25కిలోలు స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. మొత్తం పట్టుబడ్డ విత్తనాల విలువ విలువ సుమారు 6లక్షల 85 వేల రూపాయల వరకు ఉంటుంద న్నారు. పట్టుబడ్డ వారు చింతలమానేపల్లి మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన పురుషోత్తం, పోచం, కృష్ణ, దహగాం మండలంలోని అత్తిని గ్రామానికి చెందిన రాజన్న, గుం టూరుకు చెందిన సురేష్ అనే ఐదుగురు వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు తెలిపారు. ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిపై కేసు నమోదు చేశారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



ఇనోష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: వేసవిలో నీటి సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఏఈ: వేసవిలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో గ్రామపంచాయతీ ట్రాక్టర్ల ద్వారా, చేతిపంపుల ద్వారా నీటి సమస్యను పరిష్కరించడానికి చర్యలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: మొట్లగూడ, చిన్న అయినం గ్రామాల్లో నీటిని ఎలా సరఫరా చేస్తున్నారు?

ఏఈ: మొట్లగూడ గ్రామానికి గెర్రె సమీపంలోని సంపు ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. అదే విధంగా చిన్న అయినంలో గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో చేతి పంపులు, రక్షిత మంచినీటి పథకాలు ఎన్ని ఉన్నాయి?

ఏఈ: దహెగాం మండలంలో 24 గ్రామపంచాయతీల్లో 238 చేతిపంపులు, 66 రక్షిత మంచినీటి పథకాలు ఉన్నాయి. చేతిపంపుల మరమ్మతులను గ్రామ పంచాయతీల ద్వారా చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నాం.

- దహెగాం, (ఆంధ్రజ్యోతి)

అంగన్‌వాడీల్లో ఫేస్ అథెంటిఫికేషన్

- పోషణ్ అభియాన్ యాప్‌లో లబ్ధిదారుల ఫొటోలు నిక్షిప్తం
- పారదర్శక సేవల కోసం ప్రభుత్వం శ్రీకారం





రెబ్బెన, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలను మరింత పారదర్శకంగా ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలను చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇంటింటికి టేక్ హోం రేషన్(టీహెచ్ఆర్), బాలామృతం లబ్ధిదారులకు సక్రమంగా అందించేందుకు గాను పోషణ్ అభియాన్ యాప్‌ను రూపొందించారు. ఈ యాప్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రం తెరిచిన సమయం, పిల్లల హాజరు, హౌజ్ విజిట్, టీహెచ్ఆర్, కోడిగుడ్ల పంపిణీ, బాలామృతం అందజేత తదితర సమాచారాన్ని ఎప్పటికప్పుడు అధికారులకు అందజేయాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం దీనికి అదనంగా ఈ యాప్‌లో ప్రభుత్వం తాజాగా ఫేస్ అథెంటిఫికేషన్ సౌకర్యం జోడించింది. తద్వార లబ్ధిదారుల ఫొటోలను ఈ యాప్ ద్వారా నిక్షిప్తం చేసి సేవలు మరింత పారదర్శకంగా అందేలా చూడాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ పూర్తి..

ఫేస్ అథెంటికేషన్ అమలుకు సంబంధించి మొదట అంగన్‌వాడీ టీచర్లతో పోషణ్ అభియాన్ యాప్‌ను అప్‌డేట్ చేయించారు. తద్వార యాప్‌లోని ఫేస్ అథెంటికేషన్ ప్రోగ్రాం ద్వారా లబ్ధిదారుల ఫొటో, ఆధార్ కార్డు వివరాలు, లబ్ధిదారుల సెల్ ఫోన్ నంబ రు, రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. ఇది పూర్తి కాగానే లబ్ధిదారుల సెల్‌ఫోన్‌కు వచ్చిన వన్ టైం పాస్ వర్డ్‌ను యాప్‌లో పొందుపరిచి ప్రక్రియను పూర్తి చేస్తారు. దానిని ధ్రువీకరించినట్లు యాప్‌లో సమాచారం రాగానే అథెంటికేషన్ పూర్తి అయినట్లు అంగన్ వాడీ టీచర్లు నిర్ధారిస్తారు. ఇలా ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలోని మొత్తం లబ్ధిదారులను ఫేస్ అథెం టికేషన్ పూర్తి చేసేందుకు ఇప్పటికే జిల్లాలోని సీడీపీవోలకు, సూపర్‌వైజర్లకు ఆన్‌లైన్ ద్వారా అవగాహ న కల్పించి అంగన్‌వాడీ టీచర్లకు కూడా శిక్షణ తరగుతలను పూర్తి చేశారు. జిల్లాలో ప్రస్తుతం ఐదు ఐసీడీ ఎస్ ప్రాజెక్టులు నడుస్తున్నాయి. అందులో 973 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 8,818 మంది చిన్నారులు విద్యను అభ్యసిస్తున్నారు. వారితో పాటు గర్భిణీలు, బాలింతలు ఈ సేవలను పొందుతున్నారు.

మారుమూల గ్రామాల్లో సాంకేతిక సమస్య..

జిల్లాలోని మారుమూల గ్రామాల్లో అంగన్‌వాడీ సేవలకు సంబంధించి యాప్‌లో ఎప్పటికప్పుడు వివరాలను నమోదు చేయటం అంగన్‌వాడీ టీచర్లకు తలనొప్పిగా మారింది. ముఖ్యంగా జిల్లాలోని పలు మారుమూల గ్రామాల్లో ఇంటర్నెట్ సౌకర్యం అంతంత మాత్రంగానే ఉంటుంది. ముఖ్యంగా కెరమెరి, తిర్యాణి, రెబ్బెన, బెజ్జూరు, కౌటాల మారుమూల గ్రామాల్లో ఇంటర్నెట్ సేవలు ఆశించిన మేర లేకపోవటంతో అక్కడ పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా ఐసీడీఎస్ ద్వారా అంగన్‌వాడీ టీచర్లకు 4జీ సేవలతో కూడిన సెల్‌ఫోన్లను మాత్రమే పంపిణీ చేశారు. తద్వార వారికి వైద్య సేవలు ఉన్నప్పటికీ వినియోగించుకోలేక పోతున్నారు. దీంతో ఎంతో విలువైన సమయాన్ని, సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయటానికి కొల్పోవాల్సి వస్తోంది.

నెట్ సౌకర్యం లేక ఇబ్బంది..

మమత, అంగన్‌వాడీ టీచర్, గొల్లగూడ



గొల్లగూడ గ్రామంలో ఇంటర్నెట్ సౌకర్యం సరిగా లేకపోవటంతో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందిస్తున్న సమాచారాన్ని యాప్‌లో చేర్చటం ఇబ్బందికరంగా ఉంది. ఫొటో క్యాప్చర్ చేసి ఫీడింగ్ ఇవ్వాలని అధికారులు సూచించారు. నెట్ సేవలు సరిగ్గా లేకపోవటంతో అప్‌లోడ్ కావటం లేదు.

అనుమానాస్పదంగా వివాహిత మృతి

- భర్తే హతమార్చాడని మృతిరాలి తల్లి ఫిర్యాదు



గుర్లె లలిత(ఫైల్)

పెంచికలపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోడ్‌పల్లి గ్రామానికి చెందిన గుర్లె లలిత(35) అనే వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. లోడ్‌పల్లి గ్రామానికి గుర్లె లలిత అనే వివాహిత గ్రామ సమీపంలోని పంట చేనులో మామిడి చెట్టు వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. సోమవారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం అటుగా వెళ్లిన మృతురాలి అత్త మృతదేహాన్ని చూసి కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన సంఘటన స్థలానికి కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై కొమురయ్యలు చేరుకుని విచారణ చేపట్టారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంతో విచారణ జరిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు లలిత తల్లి తానుబాయి తన కూతురిని అల్లుడు గణేష్ హతమార్చాడని, కొంతకాలంగా అనుమానంతో వేధిస్తున్నా డని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేసినట్లు తెలిపారు. మృతురాలికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

ఉరి వేసుకుని ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య




హాసిని(ఫైల్)

జైపూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్‌పల్లిలో తుంగపిండి హాసిని (18) అనే ఇంటర్మీడియట్ విద్యార్థిని ఆదివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఏఎస్ఐ బాలయ్య, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం తుంగపిండి రాజేశంనకు కుమా రుడు పవన్, కుమార్తె హాసిని ఉన్నారు. భార్య 14 సంవత్సరాల క్రితం అనారో గ్యంతో మృతి చెందింది. పదోతరగతి పూర్తయ్యాక హాసినిని తండ్రి చెన్నూరులోని కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేర్పించా డు. చదువుపై ఇష్టం లేకపోవడంతో హాసిని చదువు మానేసి వచ్చి ఇంట్లోనే ఉంటోంది. ఒక సంవత్సరం వృథా కావడంతో తండ్రి రాజేశం కూతురుకు నచ్చజెప్పి 2024-25 సంవత్సరంలో మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ కాలేజీలో బైపీసీ మొదటి సంవత్సరంలో చేర్పించాడు. ఈక్రమంలో ఇంటర్ పరీక్షలు సమీపిస్తుండడంతో ఫెయిల్ అవుతానేమోననే భయంతో ఇంటి వెనకాల గల రేకుల షెడ్డులో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సోమవారం ఉదయాన్నే తండ్రి లేచిచూసేసరికి కూతురు ఉరివేసుకుని ఉండడంతో చుట్టు పక్కల వారితో పాటు పోలీసులకు సమాచారం అందించాడు. మృతురాలు హాసిని తండ్రి రాజేశం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో పడి ఒకరి మృతి

దహెగాం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంచెవల్లి గ్రామానికి చెందిన తుమ్మిడి చంద్రు(45) అనే వ్యక్తి బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు ప్రాణహిత-చేవెళ్ల కాలువలో పడి మృతి చెందాడు. ఏఎస్సై ప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో చంద్రు బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. గాలింపు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. సోమవారం పశువుల కాపరి లస్మక్క కాలువలో మృతదేహాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా కుటుంబీకులు, ఇరుగుపొరుగు వారు కాలువ వెంట గమనించగా చెప్పులు, టవ్వాల్ కాలువ ఒడ్డున కనిపించడంతో కాలువలో చూడగా వెంట్రుకలు కనించడంతో మృతదేహాన్ని బయటికి తీసి చంద్రుగా గుర్తించారు. మృతుడు చంద్రు కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



అంజి (ఫైల్)

కాసిపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని చొప్పరిపల్లె సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని దుబ్బగూడెంకు చెందిన యువకుడు దుర్గం అంజి (19) అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్ఐ ప్రవీణ్ కు మార్ తెలిపారు. ఎస్ఐ, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం పనినిమిత్తం అంజి బైక్‌పై మందమర్రికి వెళ్లాడు. రాత్రి తిరిగి వస్తుండగా చొప్పరిపల్లి సమీపంలోకి రాగానే అదుపు తప్పి రోడ్డు పక్కన రెయిలింగ్‌కు వేగంగా ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడిక క్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుని తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్క్రాప్ చోరీ కేసులో ఒకరిపై కేసు నమోదు

మంచిర్యాల క్రైం, మార్చి3 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం ఎంసీసీ సిమెంట్ కంపెనీలో స్క్రాప్‌ను దొంగలించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రాజీవ్‌నగర్‌కు చెందిన సారయ్య సోమవారం ఉదయం కంపెనీ గోడ దూకాడు. తలుపు తాళం పగులకొట్టి స్క్రాప్ వస్తువులు దొంగలించి పారిపోతున్నాడు. వాచ్‌మెన్ దేశపోగు క్రైస్తుదాస్ వ్యక్తిని వెంబడించి పట్టుకున్నాడు. స్క్రాప్ విలువ సుమారు ఐదు వేలు ఉంటుంది. వాచ్‌మెన్ ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఉపాధ్యాయుల ఎమ్మెల్సీగా మల్క కొమురయ్య

- మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే ఘన విజయం - రెండో స్థానంలో నిలిచిన పీఆర్టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి - పట్టభద్రుల స్థానంలో కొనసాగుతున్న ఉత్కంఠ



విజయ సంకేతం చూపుతున్న మల్క కొమురయ్య

కరీంనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కమలం విరబూసింది. బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య మొదటి ప్రాధాన్య ఓట్లతోనే ఘనవిజయం సాధించారు. ఆయన తన సమీప పీఆర్టీయూ బలపరిచిన అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డిపై 5,777 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. బీజేపీ మాత్రమే ఈ స్థానంలో అభ్యర్థిని పోటీలో నిలుపగా మిగతా పార్టీలు దూరంగా ఉన్నాయి. 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నా ప్రధానంగా బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్యకు పీఆర్టీయూ బలపరిచిన వంగ మహేందర్‌రెడ్డి గట్టి పోటీనిచ్చారు. నియోజకవర్గంలో 27,088 మంది ఓట ర్లు ఉండగా 25,041 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ రాత్రి 9 గంట లకు ముగిసింది. నియోజకవర్గంలో 27,088 మంది ఓటర్లు ఉండగా 24,968 మంది మరో 73 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం పోలైన 25,041 ఓట్లు పోల్‌కాగా 897 ఓట్లు చెల్లకుండా పోయాయి. 24,144 ఓట్లు చెల్లుబాటు కాగా అభ్యర్థి గెలుపొందడానికి 12,081 కోటా ఓట్లుగా గుర్తించారు. బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులోనే కోటా ఓటుకు మించి ఓట్లు పోలయ్యాయి. దీంతో ఆయనను మొదటి ప్రాధాన్య ఓటుతోనే గెలుపొందినట్లుగా ప్రకటించారు. మల్క కొమురయ్యకు 12,959 ఓట్లు రాగా ఆయన సమీప పీఆర్టీయూ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డికి 7182 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్యకు పీఆర్టీయూ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి, సిట్టింగ్ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మరో అభ్యర్థి వై అశోక్‌కుమార్ మధ్య పోటీ ఉంటుందని అందరూ భావించగా అంచనాలను తారుమారు చేస్తూ కొమురయ్య మొదటి ప్రాధాన్యత ఓట్లలోనే 5,777 ఆధిక్యంతో గెలుపొంది సంచలనం సృష్టించారు.

● కొనసాగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్ ప్రక్రియ

కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో ఉదయం 8 గంటల నుంచి పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓట్ల లెక్కింపును ప్రారంభించారు. పట్టభద్రుల ఓట్లను లెక్కించేందుకు 21 టేబుళ్లను, ఉపాధ్యాయ ఓట్లను లెక్కించేందుకు 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ముందుగా చెల్లిన ఓట్లు, చెల్లని ఓట్లను వేర్వేరు చేసే ప్రక్రియను చేపట్టారు. ఈసందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్లలో అధికంగా చెల్లని ఓట్లు కనిపించడం అభ్యర్థులను ఆందోళనకు గురిచేసింది. పట్టభద్రుల స్థానంలో 56 మంది అభ్యర్థులు పోటీ చేశారు. 2,50,106 ఓట్లు పోలయ్యాయి. వీటి నుంచి చెల్లిన, చెల్లని ఓట్లను వేరు చేసే ప్రక్రియ రాత్రి వరకూ పూర్తికాలేదు. చెల్లిన, చెల్లని ఓట్ల వేరు చేసే ప్రక్రియ పూర్తిచేసి 25 ఓట్లకు ఒక బెండల్‌ను కట్టి, ఆ తర్వాత ఓట్లను లెక్కిస్తారు. 25 చొప్పు ఓట్ల కట్టలు కట్టే ప్రక్రియ మంగళవారం మధ్యాహ్నాం వరకు పూర్తయ్యే అవకాశముందని, ఆ తర్వాత నుంచే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కావచ్చని అంచనావేస్తున్నారు.

ఘనంగా ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం



సిర్పూర్(టి)లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అటవీ అధికారులు

సిర్పూర్(టి), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) అటవీ రేంజ్‌లో సోమవారం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో ఎక్బాల్ హుస్సేన్ మాట్లాడుతూ వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వన్యప్రాణులను వేటా డినా, వాటి ఆవాసాలను ధ్వంసం చేసినా చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమం లో డీఆర్‌వో శ్రీధరాచారి, సెక్షన్ ఆఫీసర్లు తిరుపతి, మోతీలాల్, మోహన్‌రావు, ప్రసాద్‌రావు, ఉపాధ్యాయులు బీట్ ఆఫీసర్లు, వాచర్లు పాల్గొన్నారు.

బెజ్జూరు: వన్యప్రాణులకు హాని తలపెట్టవద్దని బెజ్జూరు రేంజ్ అధికారి ముసావేర్ సూచించారు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా సోమవారం అటవీశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ ప్రతీ ఒక్కరిపై ఉందని, వాటికి హాని తలపెట్టవద్దన్నారు. హాని తలపెడితే వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పెంచికలపేట: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో సోమవారం ప్రపంచ వన్యప్రాణి దినోత్స వాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల కు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమ తులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వన్య ప్రాణుల ప్రాముఖ్యత, జీవ వైవిధ్యంలో ప్రకృతి పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో జంతువుల పాత్ర గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది ఎఫ్ఎస్‌వో జగన్‌మోహన్‌గౌడ్, బీట్ అధికారులు సతీష్, సంగదీప్, స్వర్ణలత, విజయ లక్ష్మి, అనిమల్ ట్రాకర్స్ రాజు, రామయ్య పాల్గొన్నారు.

చింతలమానేపల్లి: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని డిప్యూటీ రేంజ్ అధికారి సంతోష్‌కుమార్ తెలిపారు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా మండలంలోని రవీంద్రనగర్‌లో అవగాహన కల్పించారు. ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.

వ్యాయామం చేస్తూ గుండెపోటుతో ఆర్ఎంపీ మృతి

మంచిర్యాల క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం గౌతమినగర్‌కు చెం దిన ఆర్ఎంపీ వైద్యులు కట్కూరి శ్రీనివాస్ (55) ఉదయం బాలుర పాఠశాల మైదానంలో ఉదయం వ్యాయామం చేస్తూ గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే శ్రీనివాస్ మైదానంలో ఫిట్‌నెస్ సెంటర్ సభ్యులతో వ్యాయామం చేస్తున్నా డు. అకస్మాత్తుగా గుండెపోటువచ్చి స్పృహతప్పి మైదానంలో కుప్పకూలాడు. వెంటనే తోటి మిత్రులు సీపీఆర్ చేశారు. అయినా ఫలితం లేకపోయింది. ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే శ్రీనివాస్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య విజయలక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు.

108లో ప్రసవం

పెంచికలపేట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం ఓ గర్భిణీ 108 అంబులెన్స్‌లో మగ శిశువుకు జన్మనిచ్చింది. ఈఎంటీలు సుధాకర్, రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గుంట్లపేట గ్రామానికి చెందిన గిరుగుల సవితకు ఉదయం పురిటి నొప్పులు అధికమవడంతో 108ని సంప్రదించారు. అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో రాస్పెల్లి గ్రామసమీపంలో పురిటి నొప్పులు అధికమై మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. అనంతరం కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆశా కార్యకర్త విజయ తెలిపారు.

వాహనం ఢీకొని 14 గొర్రెలు మృతి

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుడ సమీపంలోని మైసమ్మ ఆలయం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని 14 గొర్రెలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్‌కు చెందిన గొర్రెల కాపరికి చెందిన గొర్రెలు రోడ్డు దాటుతున్న క్రమంలో మహారాష్ట్ర నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో 14 గొర్రెలు మృతి చెందాయి. ఒకేసారి అంతపెద్ద మొత్తంలో గొర్రెలు మృతిచెందడంతో యజమాని కన్నీటి పర్యంతం అయ్యాడు.

ట్రేడ్స్‌మెన్ హక్కుల సాధనకు కృషి

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న ట్రేడ్స్‌మెన్ హక్కుల సాధనకు కృషి చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి. సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కె. రాజ్‌కుమార్ అన్నారు. ట్రేడ్స్‌మెన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ కమిటీ జనరల్ బాడీ సమావేశం సీసీసీలోని నర్సయ్య భవన్‌లో జరిగింది. ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడారు. ట్రేడ్స్‌మెన్ మెడికల్ అన్‌ఫిట్ అయితే వారికి సూటబుల్ జాబ్ ఇవ్వాలని, పర్మనెంట్ హెల్పర్లు కేటాయించాలని, ఏరియా పరిధి నిర్ణయించాలని, మెరుగైన చార్జ్ అలవెన్స్ ఇవ్వాలని, డిసిగ్నేషన్ మార్పు చేయాలని, తదితర డిమాండ్లపై యాజమాన్యంతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

● ట్రేడ్స్‌మెన్ బ్రాంచ్ కమిటీ ఎన్నిక

అనంతరం ట్రేడ్స్‌మెన్ శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ కమిటీని ఎన్నుకున్నారు. బ్రాంచ్ కార్యదర్శిగా ఎం రాజేంద్రప్రసాద్, బ్రాంచ్ ఉపాధ్యక్షుడిగా నాగభూషణం, సహాయ కార్యదర్శిగా సురేష్, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆళ్ల వెంకట్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా రంగు రమేష్, మురళి, పద్మరాజు, జె శ్రీనివాస్, సాగర్, ఎం శ్రీనివాస్, ముత్యాల శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉపప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, జీఎం కమిటీ చర్చల ప్రతినిధి బద్రి బుచ్చయ్య, పిట్ కార్యదర్శులు సదానందం, మురళీ చౌదరి, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్వార్టర్స్ కేటాయింపులో వివక్ష

శ్రీరాంపూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): క్వార్టర్స్ కేటాయింపులో వికక్ష చూపుతున్నారని, చేంజ్ ఆఫ్ క్వార్టర్స్‌లో అందరికీ అవకాశం ఇవ్వాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి అనిల్ రెడ్డి డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. శ్రీరాంపూర్ ఏరియాలోని కార్మికులకు కేటాయిస్తున్న విధానంలో వివక్ష చూపుతున్నారని ఆరోపించారు.

ఆరు నెలల కాలం నుంచి చేంజ్ ఆఫ్ క్వార్టర్స్ ఇస్తున్నారని, కానీ అందరికీ అవకాశాలు లభించడం లేదన్నారు. గతంలో కింది క్వార్టర్లు తీసుకున్న వారికి కాకుండా కేవలం పైన ఉండే వారికే అవకాశాలు ఇస్తున్నారన్నారు. పై క్వార్టర్లలో ఎక్కువ మంది జూనియర్లే ఉన్నారని, మళ్లీ వారికే చేంజ్ ఆఫ్ క్వార్టర్‌కు అవకాశం ఇవ్వడం వల్ల కింది క్వార్టర్లలో ఉన్నవారికి నష్టం జరుగుతోందన్నారు. కార్మికులు తాము నిర్మించుకున్న సొంత ఇళ్లలోకి మారి క్వార్టర్లు యామాన్యానికి అప్పగిస్తే వెకేషన్ సర్టిఫికెట్ ఇవ్వకుండా తిరస్కరిస్తు న్నారన్నారు. హెచ్ఆర్ఏ అవసరం లేదని రాసిస్తేనే క్వార్టర్లు వాపసు తీసుకుంటామని నిబంధన పెట్టడం ఏ మేరకు సమంజసమని వార ప్రశ్నించారు. సింగరేణిలో ఎక్కడా లేనివిధంగా శ్రీరాంపూర్ ఏరియాలో ఇలాంటి విధానాలు అవలంబి స్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్వార్టర్లు వాపసు తీసుకొని హెచ్ఆర్ఏ చెల్లించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏరియా నాయకులు కంబాల నరసయ్య, కొమురయ్య, అశోక్, తుల అనిల్, సందీప్, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.




శాంతిఖని లాంగ్‌వాల్ ప్రాజెక్టును విరమించుకోవాలి

బెల్లంపల్లిరూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం శాంతిఖని లాంగ్‌వాల్ ప్రాజెక్టు-2ను విరమించుకోవాలని కోరుతూ సోమవారం ఆకెనపల్లి, లింగాపూర్, బట్వాన్‌పల్లి, పాత బెల్లంపల్లి, బుచ్చయ్యపల్లి గ్రామాల రైతులు కలెక్టర్ కుమార్ దీపక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో ప్రభావిత గ్రామాల్లో తాగునీటి సమస్య జఠిలంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ నెల 6న శాంతిఖని గని ఆవరణలో నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణకు సంబంధించి తమకు ఎలాంటి సమాచారం అందలేదని పేర్కొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణను రద్దుచేసి ప్రభావిత గ్రామాల్లో ప్రజల అభిప్రాయాలను సేకరించాలని కోరారు. సింగరేణి ప్రతిపాదిత శాంతిఖని గని లాంగ్ వాల్ ప్రాజెక్టు 2ను వ్యతిరేకిస్తూ తీర్మానం చేస్తామన్నారు. రైతులు సత్యనారాయణ, సింగతి కిరణ్, చింతం స్వామి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు క్రీడాపోటీలు

రెబ్బెన, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని బెల్లంపల్లి ఏరియాలోని మాదారం, గోలేటి ఆఫీసర్స్ క్లబ్ గోలేటి సింగరేణి హైస్కూల్‌లో మహిళలకు వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్టు పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న బుధవారం గోలేటి టౌన్ షిప్‌లోని జీటీసీఏ క్లబ్‌లో సాయంత్రం నాలుగు గంటల నుంచి, తేది 6న మాదారం కమ్యూనిటీ హాలులో సాయంత్రం 4 గంటల నుంచి, ఈ నెల 7న సాయంత్రం నాలుగు గంటల నుంచి వివిధ సంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఆసక్తి గల వారు తమ పేరును నమోదు చేసుకోవాలని కోరారు.



ఆందోళనకు గురి చేస్తున్న గుండెపోటు మరణాలు
రోజు రోజుకూ పెరుగుతున్న సంఖ్య
ఆహారపు అలవాట్లే కారణం
జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

హార్ట్ బీట్ ఆగుతోంది..



- నెల క్రితం మంచిర్యాలలో ఒక ప్రైవేటు ఉపాధ్యాయుడు బందం బాపురెడ్డి గ్రౌండ్‌లో షటిల్ ఆడుకుంటూ ఒక్కసారిగా కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు.
- ఆరు నెలలక్రితం జిల్లా కేంద్రంలో ఒక కానిస్టేబుల్‌తో పాటు ఒక ఎస్సై గుండె పోటుతో మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి.
- మంచిర్యాల పట్టణంలోని గౌతమినగర్‌కు చెందిన ఎల్‌ఐసీ ఏజెంట్, ఆర్‌ఎంపీ వైద్యుడు శ్రీనివాస్ సోమవారం ఉదయం వ్యాయామం చేస్తూ గుండెపోటుతో మృతి చెందాడు.

వయసులో చిన్నా పెద్దా తేడా లేకుండా వస్తున్న గుండెపోటు మరణాలు ఇప్పుడు ఆందోళనకు గురి చేస్తున్నాయి. పనిలో ఒత్తిడి, లేదా తీసుకునే జంక్ ఫుడ్, నిద్రలేమి, అధిక బరువు, రోజులో కొద్ది సమయమైనా వ్యాయామం, లేదా నడకకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం..ఇవన్నీ హార్ట్ ఎటాక్‌లకు కారణంగా చెప్పుకొస్తున్నారు వైద్యులు. ప్రస్థుత పరిస్థితుల్లో దంపతులు ఇద్దరూ ఉద్యోగాలు చేయడం..కేవలం ఆర్థిక పరమైన విషయాలపైనే చర్చిస్తూ ఆరోగ్యంపై అశ్రద్ధ వహిస్తున్నారు. నిత్య జీవితంలో పెరుగుతున్న ఖర్చులు కావచ్చు.. పిల్లల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు చేస్తున్న ఆలోచనలు కావచ్చు కొందరిని ఒత్తిడికి లోనయ్యేలా చేస్తున్నాయి. ఆ ఒత్తిడే కొన్ని సందర్భాల్లో గుండెపోటు మరణాలకు దారి తీస్తున్నాయి. ఇక నడీడు వయస్కులు ఆహారపు అలవాట్లపై శ్రద్ధ పెట్టకపోవడం, తరచూ జంక్‌ఫుడ్స్ తీసుకోవడం ప్రాణాలకు ముప్పు తెస్తున్నాయి.

మంచిర్యాలక్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకు పెరుగుతున్న గుండెపోటు మరణాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా ఈ మధ్యకాలంలో యువతలో ఈ మరణాలు ఎక్కువయ్యాయి. సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లనే ఈ మరణాలు ఎక్కువ అవుతున్నాయనేది వైద్యుల అభిప్రాయం.

సాధారణంగా గుండెకు రక్తం సరఫరాలో ఏదైన ఆటంకం కలిగినప్పుడు గుండె నొప్పి వస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎక్కువగా గుండె పోటు మరణాలు సమయానికి ఆసుపత్రికి చేరుకోకపోవడం వల్లనే జరుగుతున్నాయని పరిశోధనలో తేలిందంటున్నారు. గుండెపోటు వచ్చిన గంటలోపు రోగిని ఆసుపత్రికి తీసుకెళ్లగలిగితే ప్రయోజనం ఉంటుందని, చాలా కేసుల్లో బాధితులకు చాతినొప్పి వచ్చిన కొన్ని గంటల తరువాత ఆసుపత్రికి చేరుకోవడం వల్ల అప్పటికే జరుగాల్సిన నష్టం జరుగుతుందని పేర్కొంటున్నారు. సాధారణంగా ఎవరికైనా గుండెపోటు వచ్చినప్పుడు గంట సేపు వరకు శరీరంలో రక్తం సరఫరా జరుగుతుందని, మొదటి గంట తరువాత రక్తప్రసరణ ఆగిపోతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. గుండెపోటు వచ్చిన మొదటి గంటను గోల్డెన్ అవర్ అంటారని వైద్య నిపుణులు చెబుతున్నారు.

కారణాలు ఇవే...

ఈ మధ్య కాలంలో గుండె నొప్పితో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. గుండె పోటు వచ్చిన వారు బతికే అవకాశాలు తక్కువగా ఉంటున్నాయని అందుకే గుండెకు సంబంధించిన సమస్యతో బాధపడే వారు వైద్యుడిని సంప్రదించి సరైన చికిత్స పొందడం మేలంటున్నారు. గుండె నొప్పి రావడానికి ఎన్నో కారణాలు ఉంటాయన్నారు. టెన్షన్‌కు గురికావడం, అధిక ఒత్తిడికి గురయ్యే వారిలో గుండె నొప్పి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయంటున్నారు. అంతేగాకుండా జన్యుపరమైన లోపాల వల్ల కూడ గుండెపోటు మరణాలు పెరుగుతున్నాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

గుండెపోటు రాకుండా ప్రధానంగా మన జీవన శైలిలో మార్పులు చేసుకోవాలి. తగినంత సమయం నిద్ర పోవాలి. ప్రతీ రోజు 30 నుంచి 40 నిమిషాలు యోగా లేదా వ్యాయామం చేయాలి. ఆహారంలో ఎక్కువశాతం ప్రకృతి సహజంగా లభించే ఆకు కూరలు తీసుకోవాలి. తక్కువ మోతాదులో మాంసం తీసుకోవాలి. ముఖ్యంగా జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి. ధూమపానం, మద్యపానం, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి. బీపీ, షుగర్ అధిక కొలెస్ట్రాల్ ఊబకాయం వంటి వ్యాధులు ఉన్న వారు క్రమం తప్పకుండా చెక్ చేసుకొని వాటిని అదుపులో పెట్టుకోవాలి. వంశంలో ఆకస్మిక మరణాలు గాని గుండెపోటు గతంలో వారి కుటుంబంలో చనిపోయినట్లయితే ఎప్పటికప్పుడు గుండె పరీక్షలు చేసుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

గుండె పోటుకు ముందు కనిపించే లక్షణాలు..

గుండెనొప్పికి ముందు శరీరం పైభాగం నుంచి ఎడమచేతి కింది వరకు నొప్పిగా అనిపిస్తూ ఉంటుంది. గుండె భారంగా అసౌకర్యంగా అనిపించడం. మత్తు, శరీరానికి చెమటలు ఎక్కువగా పట్టడం, తీవ్రమైన అలసట, మాట్లాడేటప్పుడు గందరగోళానికి గురికావడం, నడిచినప్పుడు చాతిలో నొప్పిగా అనిపించడం, పడుకున్నప్పుడు మధ్య రాత్రిలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడడం, అధిక బీపీ, కొలెస్ట్రాల్, షుగర్ వంటి లక్షణాలు ఉంటాయి.



గుండె పోటును గుర్తించాలి...

40 నుంచి 60 సంవత్సరాల మధ్యలో ఎవరైన ఉన్న వారు సంవత్సరానికి ఒక సారి గుండెకు సంబంధించిన టెస్టులు, ఈసీజీ, 2డిఇకో, టీఎంటీ పరీక్షలు చేసుకోవడం వల్ల గుండె రక్తనాళాల్లో ఉన్న బ్లాక్స్‌ను ముందుగానే తెలుకోవడం వల్ల ముందుగానే నివారించవచ్చు.

గ్యాస్ట్రిక్, గుండె నొప్పికి తేడా...

చాతి మధ్య భాగంలో బరువుగా అనిపించినపుడు అది గుండె నొప్పిగా గుర్తించాలి. ఆ నొప్పి కింద పొట్టలో పైభాగం వైపు, పైనమెడ, దవుడవైపు కుడినుంచి ఎడవైపు నొప్పి పాకినట్లు అనిపిస్తుంది ఈనొప్పి వచ్చి నప్పుడు ఒళ్లంతా చెమటలు పట్టడం, వాంతులు అవడం, ఆకస్మికంగా ఆయాసం రావడం జరుగుతుంది. గుండెనొప్పి ఎక్కువశాతం ఎమోషనల్‌గా అయినప్పుడు గాని, పని ఒత్తిడి ఉన్నప్పుడు గాని వస్తుంది. ఈ నొప్పి ఎక్కువగా నడిచినప్పుడు ఎక్కువగా అవుతుంది.

గాస్ట్రిక్ ప్రాబ్లం..

గ్యాస్ట్రిక్ నొప్పి పొట్ట పై భాగంలో మంటగా అనిపిస్తుంది. ఈ నొప్పి మనం తీసుకునే ఆహారంతో ముడిపడి ఉంటుంది. ముఖ్యంగా మసాల, ఫాస్ట్ ఫుడ్ ఆహార పదార్థాలు తీసుకున్నప్పుడు గ్రాస్టిక్ నొప్పి వస్తుంది.

ఇవి తింటే గుండె పదిలం...

గుండె సమస్యలు రాకుండా ఉండాలంటే ఆకు కూ రలు ఎక్కువగా తీసుకోవాలి. ప్రతి రోజు ఆహారంలో భాగంగా బ్రేక్‌ఫాస్ట్‌లో వోట్స్ తినడం గుండెకు ఎంతో మేలు చేస్తుంది. తరచూ చేపలు తినాలి.

ముందు జాగ్రత్తలతో నివారించొచ్చు...

గుండె వైద్య నిపుణులు డాక్టర్ వేణుగోపాల్



ముందు జాగ్రత్తల చర్యల వల్ల గుండె సంబంధిత వ్యాధులను నివారించ వచ్చు. ముఖ్యంగా మద్య పానం, ధూమ పానానికి దూరంగా ఉండాలి. కుటుంబ సభ్యుల జన్యుపరమైన లోపాల వల్ల కూడ గుండె పోటు వస్తుంది. నడిచేటప్పుడు లేదా మెట్లు ఎక్కేటప్పుడు చాతి నొప్పి రావడం,శ్వాస అందకపోవడం, గుండెలో దడ అనిపించడం లక్షణాలు ఉన్నప్పుడు అశ్రద్ధ చేయకుం డా డాక్టర్‌ను సంప్రదించాలి. ముఖ్యంగా ఈసీజీ, 2డి ఈకో, టీఎం టీ పరీక్షలు చేయడం వల్ల గుండె సంబం ధిత వ్యాధులు ముందే తెలుసుకోవడంతో వాటిని నివా రించవచ్చు. ప్రస్తుతం యువతలో గుండె పోటు మరణాలు పెరిగాయి. ఆహారపు అలవాట్లు దీనికి కారణం.

పరామర్శ

జన్నారం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముత్యం రాజన్నతో పాటు లింగాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బొంగు వెంకగౌడ్ అల్లుడు కొన్ని రోజులుగా హైద్రాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సోమవారం పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

కాసిపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోమటిచేను సమీపంలో అనుమానస్పదంగా నిశ్చకోళ్ల శ్రీనివాస్ రోడ్డు పై పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు దేవాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. శ్రీనివాస్ ఓరియంట్ కంపెనీలో కాంట్రాక్టు కార్మికునిగా పనిచేస్తున్నాడు. సోమగూడెం నుంచి బైక్‌పై ఇంటికి వస్తుండగా రోడ్డుపై గాయాలతో పడి ఉండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ ఆంజనేయులు అంబులెన్స్‌లో గాయపడిన వ్యక్తిని మంచిర్యాల లోని ఆసుపత్రికి తరలించారు.

పద్మశాలీలకు చట్ట సభల్లో ప్రాధాన్యం కల్పించాలి

పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలువేరు సదానందం

దండేపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీలకు జనాభా దామాషా ప్రకరాం చట్టసభల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించాలని అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలువేరు సదానందం అన్నారు. ఈనెల 9న హైదరాబాద్‌లో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగే పద్మశాలి మహాసభపై సోమవారం దండేపల్లిలో పద్మశాలి సంఘం నాయకులతో సన్నాహక సభ ఏర్పాటు చేశారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పద్మశాలీల హక్కుల సాధనకు అందరు ఏకం కావాలన్నారు. మన పద్మశాలీల వాటా కోసం, మన హక్కుల సాధనకు ఆత్మగౌరవం కోసం మార్చి 9న నిర్వహించే 17వ అఖిల భారత పద్మశాలి మహాసభ, తెలంగాణ ప్రాంత పద్మశాలి 8వ మహాసభలను పద్మశాలీలందరు అధిక సంఖ్యలో హాజరై మహాసభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో దండేపల్లి మండల పద్మశాలి అధ్యక్షకార్యదర్శు వడ్డెపల్లి దేవయ్య, అలిశెట్టి లక్ష్మణ్, పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శంకర్, సంఘం నాయకులు ఎనగందుల సత్యం, వడ్డెపల్లి జ్ఞానయ్య, అలిశెట్టి శంకరయ్య, కడారి పెద్ద బుచ్చన్న, ఎనగందుల చింటూ, రవీందర్ పాల్గొన్నారు.

జన్నారం : ఈ నెల 9న జరిగే అఖిల భారత, రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చిలువేరు సదానందం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గంగయ్య, పట్టణాధ్యక్షుడు కృష్ణ, ఆడెపు లక్ష్మీనారాయణ, భాస్కర్. మధు, రాజమౌళి, రమేష్, సత్యం, రమేష్, రాము, వేణు,నరేందర్ పాల్గొన్నారు.



దండేపల్లిలో మాట్లాడుతున్న రాష్ట్ర కారదర్శి సదానందం.

బెల్లంపల్లి : ఈ నెల 9న హైద్రాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగే అఖిల భారత పద్మవాలి మహాసభ, 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహాసభలను విజయవంతం చేయాలని సంఘం సంయుక్త కార్యదర్శి దీకొండ రాజలింగం కోరారు. సోమవారం పట్టణంలోని పద్మశాలి భవన్‌లో మహాసభల పోస్టర్లను, కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంకటి శ్రీనివాస్, గుండేటి సతీష్, సుంకె లక్ష్మీనారాయణ, చిదిరాల ఉమా ప్రసాద్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక క్షేత్రంగా త్రిశక్తి అష్టలక్ష్మీ దేవాలయం

- నిత్యం పెరుగుతున్న భక్తుల రద్దీ
- నేటి నుంచి మూడు రోజులు విగ్రహ ప్రతిష్ఠాపనలు

మందమర్రిటౌన్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): మందమర్రి పట్టణంలోని బురదగూడెం సమీపంలోని త్రిశక్తి అష్టలక్ష్మీ దేవాలయంలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోంది. ఈ ఆలయాన్ని మూడేళ్ల క్రితం సతీష్ అయ్యగారు మూడు ఎకరాల స్థలంలో ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. నిర్మాణం కోసం నిర్మాణ కర్త సతీష్ భవాని మూడు ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆలయ నిర్మాణానికి ఆ భూమిని విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణాన్ని సొంతఖర్చులతో పూర్తి చేశారు. ఆలయంలో త్రిశక్తి అష్టలక్ష్మీ, కామాక్య అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అమ్మవారి విశిష్టతకు సంబంధించి విస్తృతంగా ప్రచారం చేయడంతో మూడు సంవత్సరాలుగా భక్తుల రద్దీ కూడా పెరిగింది. ఆలయంలో కుటుంబ సభ్యుల పేరిట అర్చనలు, హోమాలు చేయడం నిత్యం పెరిగిపోయింది. ఆలయానికి వచ్చే భక్తుల కోసం పూజారులు సౌకర్యాలు కూడ ఏర్పాటు చేశారు. హోమ యజ్ఞాలతో అర్చనలు చేసుకునే భక్తులకు ప్రత్యేక ప్రసా దాలను కూడ అంద జేశారు.



అమ్మవారి విగ్రహాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న పూజారులు

● ఆలయ ప్రత్యేకతలు..

ఆలయంలో త్రిశక్తి, అష్టలక్ష్మీ, కామక్య, దశ మహావిద్య అమ్మవారి ప్రతిష్ఠించారు. వీటితో పాటు వివిధ దేవాతమూర్తుల విగ్రహాలు ప్రతి ష్ఠాపనకు సర్వం సిద్ధం చేశారు. ఆలయం చుట్టు మామిడితోటలు, ఈత వనాలు ఉండడంతో భక్తులు సాయం కాలం సేదతీరుతున్నారు.

దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్త కుటుంబాలకు ఆలయ పూజారులు ఆలయంలో సౌకర్యాలు కూడ కల్పిస్తున్నారు. భక్తులకు అన్న ప్రసాదాన్ని సమకూరుస్తున్నారు.

● ఆలయంలో కామాక్య శక్తిపీఠ స్తంభాలు..

ఆలయంలో అమ్మవారి శక్తిపీఠాలకు సంబంధించిన స్తంభ నమూనాలు కూడ ఏర్పాటు చేశారు. వాటి దర్శనంతో పాటు పూజ కార్యక్రమాలు కూడ ప్రతి రోజు నిర్వహి స్తారు. వివిధ దోషాలు ఉన్నటివంటి వారు అమ్మవారిని దర్శించుకొని ఈ శక్తి స్తంభాలను పూజలు చేసే వారికి దోష నివారణ జరుగుతుందని నమ్మకం ఉంది. ఈ ఆలయంలో శక్తి స్తంభాలకు కూడ ఒక విశిష్టత ప్రత్యేక పూజలు జరుపడం విశేషం.

4న మంగళవారం ఆలయంలో గజ స్తంభము, వల్లభ గణపతి, రాజ్యశ్యామల, వారాహి, లలితాదేవి విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నారు. శాస్త్రేయ ఆగమ పంచాంగం ప్రకారం పూజాకార్యక్రమాల నిర్వహించబోతున్నారని దీనిని విజయవంతం చేయాలని సతీష్ భవాని తెలిపారు. ఈ పూజ కార్యక్రమాలకు చెన్నూర్ ఎమ్మెల్యే జి. వెంకటస్వామి, మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, ఎస్‌ఐ రాజశేఖర్, మందమర్రి జీఎం దేవేందర్, కమిషనర్ రాజలింగు, తహసీల్దార్ సతీష్, తదితరులు హాజరవుతున్నారు.



త్రిశక్తి కామాక్య అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

● హిందూ ధర్మ రక్షణ అందరి బాధ్యత...

ప్రధాన అర్చకులు సతీష్ భవాని

హిందూ సనాతన ధర్మరక్షణ హిందువులుగా ప్రతి ఒక్కరి బాధ్యత. త్రిశక్తి, అష్టలక్ష్మీ, కామాక్య అమ్మవారికి చరిత్ర చాలా గొప్పది. అమ్మవారిని దర్శించుకునే కుటుంబాలకు అంతా శుభమే కలుగుతుంది. కామాక్య అమ్మవారి ఆలయం నిర్మాణం కోసం సొంత నిధులను వెచ్చించాను. అమ్మవారి గొప్పతనం చాటేందుకు కృషి చేస్తున్నాము.

భువన్ సర్వే పునఃప్రారంభం

(5వ పేజీ తరువాయి)

జిల్లా వ్యాప్తంగా సుమారు 40 వేల అసస్‌మెంట్లను గుర్తించగా అందులో సుమారు 20 వేల వరకు సర్వే పనులు పూర్తి చేశారు. మిగితా మొత్తం పెండింగ్‌లో ఉండిపోయింది. ఆ తరువాత 2023లో సర్వేను తిరిగి ప్రారంభించినప్పటికీ సాంకేతిక లోపం కారణంగా మళ్లీ అంతరాయం ఏర్పడింది.

● పునఃప్రారంభానికి సన్నాహాలు...

2020లో ప్రారంభమై అర్థాంతరంగా నిలిచిపోయిన భువన్‌యాప్ సర్వేను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మళ్లీ కొనసాగించాలని నిర్ణయించింది. దీంతో అధికారులు తిరిగి ఆ పనులు చేపట్టేందుకు సన్నద్ధం అవుతున్నారు. అయితే పంచాయతీ ఎన్నికలు కూడా నిర్వహించాల్సి ఉండడంతో సర్వే ఎలక్షన్ల తరువాత నిర్వహిస్తారా...? లేక ఈ లోపే చేపడతారా.. అన్న విషయంలో స్పష్టత లేదు. అప్పుడు నిలిచిపోయే వరకు మిగిలి ఉన్న సుమారు 20 వేల అసస్‌మెంట్స్ సర్వే ప్రస్తుతం చేపట్టాల్సి ఉంది. కాగా ఈ విషయమై అధికారులకు కూడా పూర్తి స్పష్టత లేకపోవడంతో పంచాయతీ ఎన్నికల తరువాతనే భువ న్‌సర్వే నిర్వహిస్తారనే ప్రచారం జరుగుతోంది. భువన్ సర్వే పూర్తయితే స్థానిక సంస్థలకు భారీగా ఆదాయం సమకూరే అవకాశాలు ఉన్నాయి. ఇంతకాలం కింది స్థాయి సిబ్బందితో కుమ్మక్కై తక్కువ పన్ను విధించేలా ఏర్పాట్లు చేసుకున్న యజమానులకు మాత్రం 2020 నుంచి కోల్పోయిన మొత్తాన్ని స్థానిక సంస్థలు వసూలు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ సంస్థకు గుర్తింపు

- ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు అవార్డు
- నాలుగు లక్షల శ్రీగంధం చెట్లు నాటినందుకు పురస్కారం



అవార్డు అందుకుంటున్న అంజనీపుత్ర చైర్మన్ శ్రీధర్, ఎండీ పిల్లి రవి

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాకు చెందిన అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ సంస్థకు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం దక్కింది. ఈ మేరకు ఆదివారం రాత్రి మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఆర్ గార్డెన్‌లో జరిగిన ప్ర త్యేక కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ఇండియా కో ఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్ చేతుల మీదుగా సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్, ఎండీ పిల్లి రవి అవార్డు అందుకున్నారు. వ్యాపార రంగంలో చెట్లు నాటాలన్న ఆలోచనలతో 2017 సంవత్సరంలో ఈ రియల్ ఎస్టేట్ సంస్థ వ్యవస్థాకులు గుర్రాల శ్రీధర్ నేతృత్వంలో ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు అంజనిపుత్ర సంస్థ 350 ఎకరాల్లో నాలుగు లక్షల శ్రీగంధం చెట్లు నాటి జిల్లా ప్రజలందరికీ స్ఫూర్తిగా నిలిచారు. నిబద్ధతతో ప్రతీ ఒక్కరు పడిన కష్టానికి ఫలితం ఈ అవార్డు అని అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్, ఎండీ పిల్లి రవిలు పేర్కొన్నారు. కార్యక్రమంలో కంపెనీ డైరెక్టర్లు, ఇంటర్నేషనల్ వండర్ బుక్ రికార్డు తెలంగాణ ప్రతినిధులు అరుణ్‌కుమార్, శంకర్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి గురుకుల పాఠశాలలో ర్యాగింగ్

బెల్లంపల్లిరూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లిలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల (సెంటర్ ఆఫ్ ఎడ్యుకేషన్)లో ర్యాగింగ్ ఘటన కలకలం రేపింది. సోమవారం చక్రధర్ అనే 8వ తరగతి విద్యార్థిని బట్టలు విప్పించి సిగరెట్ తాగాలంటూ ఇంటర్మీడియట్ సెకండియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేశారు. విషయాన్ని ప్రిన్సిపల్ శ్రీధర్‌కు పదవ తరగతి విద్యార్థి తెలపడంతో అతన్ని కూడా ఇంటర్ సెకండియర్ విద్యార్థులు చితకబాదారు. ఈ ఘటనలతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనలకు గురయ్యారు. ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై తాళ్లగురిజాల ఎస్‌ఐ రమేష్‌ను వివరణ కోరగా ర్యాగింగ్ తమ దృష్టికి వచ్చిందని, పాఠశాలకు వెళ్లి పరిశీలించామని, బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు..

సమన్వయంతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న వ్యవసాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ శ్రీలత

బెల్లంపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : శాస్త్రవేత్తలు, వ్యవసాయా ధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పొలాస ఇన్‌చార్జి సహా వ్యవసాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ శ్రీలత పేర్కొన్నారు. సోమవారం బెల్లంపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన 8వ శాస్త్రీయ సలహా మండలి సమావేశానికి హాజరయ్యారు. మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాలోని కృషి విజ్ఞాన కేంద్రం, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు గత సంవత్సరం చేపట్టిన పరిశోధన అంశాల మీద, వచ్చే వానకాలం యాసంగిలో చేపట్టబోయే పరిశోధన అంశాలపై సమీక్ష నిర్వహించి తగు సూచనలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతూ రైతులకు సాంకేతికతను మరింత చేరువ చేయాలన్నారు. బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కోట శివకృష్ణ మాట్లాడుతూ భవిష్యత్‌లో వ్యవసాయ సాంకేతికతను రైతులకు మరింత చేరువ చేసే విధంగా బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రణాళిక రూపొందించుకుని రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసే లక్ష్యంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ రవీందర్ నాయక్, రాంప్రసాద్, ప్రధాన శాస్త్రవేత్త (ఎంటమాలజీ) శ్రీధర్‌సిద్ది, జిల్లా వ్యవసాయాధికారి కల్పన, ఆసిఫాబాద్ జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివా సరావు, నాబార్డు డీడీఎం వీరభద్రం, లీడ్ బ్యాంకు మేనేజర్ తిరుపతి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, శాస్త్రీయ సలహా మండలి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్ర సందర్శన

మందమర్రిరూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియాలో భాగంగా మందమర్రి మండలంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు భువనగిరి జిల్లాలో ఉన్న వన్‌డే కిసాన్ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. విద్యార్థులకు నీటిని నిల్వ చేసి వాడుకునే విదానంపై అవగాహన కల్పించారు. రైతులు పంట పండించే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ సారాతస్లీమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

మందమర్రిటౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి ఏరియాలోని మూసివేసిన కేకే 1 గని సమీపంలోని రైల్వే సైడింగ్ సివిల్‌పనులను సోమవారం జీఎం సివిల్ సూర్యనారాయణ పరిశీలించారు. పనుల పురోగతి గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట ఏజీఎం సివిల్ నవీన్, ఎస్‌ఈ రాము, అధికారులు ఉన్నారు



పారిశుధ్య పనుల పరిశీలన

కెరమెరి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల, మోడి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షల నేపథ్యంలో పారిశుధ్య పనులను ఎంపీడీవో అంజద్‌పాషా సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, బోర్‌వెల్ మరమ్మతు తదిరులు పనులు చేపట్టామని తెలిపారు. ఆయన వెంట కార్యదర్శి గణేష్, సిబ్బంది ఉన్నారు.

యాసంగి పంట సాగుకు నీరందించాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్, అధికారులు

ఆసిఫాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): యాసంగిలో ప్రాజెక్టులు, చెరువుల కింద సాగు చేసే పంటలకు నీరందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర వ్యవసాయ నీటి పారుదల, విద్యుత్ శాఖల అధికారులత కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సాగునీటి శాఖాధి కారులు, వ్యవసాయ, విద్యుత్ శాఖాధికారుల తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువులు, వ్యవసా య బోరుబావుల కింద సాగయ్యే యాసంగి పంటలకు సాగునీటిని అందించేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవా లని సూచించారు. ఈ సీజన్‌లో ఒక ఎకరం కూడా ఎండి పోకూడదని, వచ్చే 15 రోజులు చాలా కీలకమైన సమయమని అన్నారు. ప్రాజెక్టుల నుంచి చెరువులను నింపాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా పర్యవేక్షించాలని, సాగునీటిని చాలా జాగ్రత్తగా వినియోగించుకోవాలని, వృథా చేయకూడదని తెలిపారు. తహసీల్దార్, నీటి పారుదల శాఖ ఏఈ, ఏఓ అధికారులతో కమిటీ ఏర్పాటు చేసుకోవాలని, తాగునీరు, సాగునీరుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. జిల్లాలో గల ప్రతీ గురుకులాన్ని సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న నూతన మెనూ అమలుపై తనిఖీలు నిర్వహించాలని, విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలోని వీసీ హాల్ నుంచి అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఎస్ఈ శేషరావు, నీటి పారుదల శాఖ ఈఈలు ప్రభాకర్, గుణవంతరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారి దత్తారాం, సాగునీటి శాఖాధికారులు హాజరయ్యారు.

ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2024 ద్వారా నియామకం అయిన ప్రాథమిక ఉపాధ్యాయులకు జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహించిన శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పరిపక్వత, బోధన అభ్యసన, మూల్యాంకనం మందిపు పద్ధతులు, సాంకేతిక వనరులు, ఉపకరణాలు, పాఠ్య పుస్తకాల సమర్థవంతమైన వినియోగం, తరగతి గది ప్రక్రియలు, విద్యా ప్రమాణాలు, అభ్యసన ఫలితాలు, వార్షిక పాఠ్యాంశ పీరియడ్ ప్రణాళిక తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, విషయ నిపుణులు శంకర్, రమేష్, వెంకటేష్, చైతన్య, బాలకృష్ణ, ఝాన్సీ, రాణి, రంగయ్య, రాజేందర్, మహేందర్, గంగాధర్, గోవింద్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడలో ఇంటర్ పరీక్షలు

- ప్రతీ పరీక్ష కేంద్రంలో ఐదు సీసీ కెమెరాలు ఏర్పాటు
- మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా ఫ్లయింగ్ స్క్వాడ్‌లు
- రేపటి నుంచి ప్రారంభం కానున్న పరీక్షలు



వాంకిడి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యకు మార్గం వేసే ఇంటర్ పరీక్షలు సమీపించాయి. బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఈ పరీక్షలు నిఘా నీడన జరగనున్నాయి. మాల్ ప్రాక్టీస్, చూచిరాతలు, ఒకరికి మరొకరు పరీక్ష రాయడం, ఇన్విజిలేటర్లు విధుల దుర్వినియోగం తదితర వాటికి తావు లేకుండా పారదర్శకంగా పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రయోగ పరీక్షల్లో ఈ విధానాన్ని అమలు చేయగా వార్షిక పరీక్షల్లో సైతం దీన్ని కొనసాగించనున్నారు. ఇందుకు అనుగుణంగా సీసీ కెమెరాలను బిగించే ప్రక్రియ చేపట్టారు.

● ప్రత్యేక బృందాల ఏర్పాటు...

పరీక్షల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా హైపవర్, డీఈసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. హైపవర్ కమిటీకి అధ్యక్షుడిగా కలెక్టర్, కన్వీనర్‌గా జిల్లా ఇంటర్ నోడల్ అధికారి, డీఈసీ కమిటీ సభ్యులుగా సీనియర్ ప్రిన్సిపాల్, సీనియర్ అధ్యాపకుడు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంలో ఆయా కళాశాలలకు చెందిన అధ్యాపకులు సభ్యులుగా ఉంటారు. ముగ్గురు సభ్యులతో కూడిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంతో పాటు ఇద్దరు సభ్యులతో ఒక్కో బృందం చొప్పున రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు.

● జిల్లాలో 19 పరీక్ష కేంద్రాలు..

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మొత్తం 48 జూనియర్ కళాశాలలు ఉండగా వీరి కోసం 19 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 11 ప్రభుత్వ, రెండు ప్రైవేటు, రెండు ఆదర్శ పాఠశాలలు, రెండు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 19 పరీక్షా కేంద్రాల్లో 10,043 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో 4,756 మంది విద్యార్థులు మొదటి సంవత్సరం, 5,287 మంది ద్వితీయ సంవత్సరంలో విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

● విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా..

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించారు. ప్రతీ కేంద్రంలో ప్రశ్నపత్రాలు తీసే ప్రాంతంలో, ప్రవేశ ద్వారం వద్ద, తరగతి గది, తదితర ప్రాంతాల్లో మొత్తం ఐదు సీసీ కెమెరాలు బిగించాలని ఇంటర్ బోర్డు అధికారులను ఆదేశించారు. పరీక్ష జరిగే తీరు మొత్తం రికార్డు చేస్తారు. ఇతరులెవరూ రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఇన్విజిలేటర్లను ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ కళాశాలల్లో పనిచేసే అధ్యాపకులతో పాటు అవసము న్న కేంద్రాల్లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను నియమించే ప్రక్రియ సాగుతోంది. అన్ని పరీక్ష కేంద్రాల్లో బుధవారం నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాలతో...

- కల్యాణి, జిల్లా ఇంటర్ నోడల్ అధికారి



ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. జిల్లా వ్యాప్తంగా 19 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రతీ పరీక్షా కేంద్రంలో ఐదు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాము. మాస్ కాపీయింగ్ తావులేకుండా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశాం. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాము.

317 జీవోను రద్దు చేయాలి

లింగాపూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 317 జీవోను రద్దు చేయాలని మండల విద్యాధికారి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వేమనపల్లి మండలం కల్మలపేట పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సంతోష్ 317 జీవో సమస్యల ములంగా తనకు బదిలీ కావడం లేదని, మానసిక ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవడంతో సోమవారం లింగాపూర్ మండలానికి చెందిన ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 317 జీవోను రద్దు చేసి ఇతర జిల్లాల ఉపాధ్యాయులను వారి వారి జిల్లాలకు పంపించాలని కోరారు.

బుద్ధుడు చూపిన శాంతి మార్గంలో నడవాలి



మాట్లాడుతున్న భదంతే ధమ్మ సారథి

వాంకిడి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గౌతమ బుద్ధుడు చూపిన శాంతి మార్గంలో నడిచి ప్రశాంత జీవనం గడపాలని ఆల్ ఇండియా భిక్కు సంఘం ప్రధాన కార్యదర్శి భదంతే ధమ్మ సారథి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో నిర్వహిస్తున్న బౌద్ధ ధమ్మ దీక్షా శ్రామినెర్ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌతమ బుద్ధుని చిత్రపటానికి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను భావితరాలకు అందజేయాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. బుద్ధుని బోధనలు నేటి సమాజానికి ఎంతో ఉపయోగకరం అన్నారు. బుద్ధుడు చూపిన మార్గం నేడు ప్రపంచమంతా ఆచరిస్తున్నారని ప్రజ్ఞా, శీలం, కరుణ అనే అంశాలపైనే మనిషి జీవనశైలి ఆధారపడి ఉంటుందని సూచించారు. బౌద్ధ ధమ్మ దీక్షను ప్రతీ ఒక్కరు ఆచరించాలని సూచించారు. కార్యక్రమంలో భంతే రాహుల్ బోధి, భంతే వివేక్, భంతే నిబ్బాన్, బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కార్, అంబేద్కర్ సంఘం నాయకులు ఉప్రె జైరాం, సునీల్‌కుమార్, విలాస్, రాజేంద్రప్రసాద్, ప్రతాప్, దుర్గం సందీప్, రోషన్, విజయ్, విఠల్, రమాబాయి మహిళా మండలి సభ్యులు, బౌద్ధ ఉపాసకులు పాల్గొన్నారు.

ఘనంగా శివశంకరుని జాతర



జాతరకు వచ్చిన భక్తులు

వాంకిడి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలోని బెండార బోడ గుట్ట సమీపంలో సోమవారం శివశంకరుని జాతర ఘనంగా జరిగింది. జాతర సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి శివశంకరుని ఆలయంలో మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా ఆలయం ప్రాంగణంలో భజనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. జాతరలో ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి

జైనూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి ప్రభుత్వమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్ అన్నారు. పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 200 యునిట్ వరకు ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సరఫరా, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి వంటి అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు గిట్టలేక ఆరోపణలు చేస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేష్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు పెందూర్ ప్రకాష్, సీనియర్ నాయకులు సుద్దాల శ్రీనివాస్, మరస్కోల సుదర్శన్, మరస్కోల దేవరావ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మండాడి లింగు, క్రిష్ణ, నాయకులు దండుగుల మహేష్, సుద్దాల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



మార్లవాయిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

జైనూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్ అన్నారు. మండలంలోని మార్లవాయిలో ప్రభుత్వం మంజూరు చేసిన 52 ఇందిరమ్మ నమూనా ఇళ్లకు మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్, మార్లావాయి మాజీ సర్పంచ్ కనక ప్రతిభ, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి అడ బీర్షావ్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి తదితరులు సోమవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ పేద ప్రజల చెంతకు చేరేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీవో మోహన్, సార్మేడీ జుగునాక దేవరావ్, దువాకి హన్మంత్‌రావ్, డార్ఫ్ యువజన సంఘం అధ్యక్షులు మధురాజ్, మార్కెట్ కమిటీ సభ్యులు మండాడి లింగు, క్రిష్ణ, గ్రామస్థులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తిర్యాణి (ఆంధ్రజ్యోతి): అర్హులైన వాందరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సాగర్ అన్నారు. సోమవారం తిర్యాణి మండలంలో రొంపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టు కింద రొంపల్లి గ్రామంలో 106 మంది లబ్ధిదారులకు మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, దానిలో భాగంగా భూమి పూజ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లేష్, నాయకులు వెంకటేశంగౌడ్, జగన్, తదితరులు పాల్గొన్నారు.

రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

- ఎమ్మెల్సీ దండె విఠల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్

సిర్పూర్(టి), మార్చి 3(ఆంధ్రజ్యోతి): రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటేందుకు నాయకులు, కార్యకర్తలు పాటుపడాలని ఎమ్మెల్సీ దండె విఠల్ సూచించారు. సోమవారం మండలంలోని లోనవెల్లి గ్రామంలో ఆయన పర్యటించి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలు ప్రతీ ఇంటికి చేరేలా కృషి చేయాలన్నారు. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు. అనంతరం బీఆర్ఎస్ మాజీ జడ్పీటీసీ దోని రవీందర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన వెంట నాయకులు ప్రేంసాగర్‌గౌడ్, గ్రామస్తులు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు సిడాం గణపతి, సోహెల్ అహ్మద్, అబ్దుల్ అకీల్, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి సూచించారు. సోమ వారం జిల్లా కేంద్రంలోని సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 36 ఆశ్రమ పాఠశాలల నుంచి 1255 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులను పరీక్షలు అంటే భయం, ఒత్తిడి లేకుండా మానసికంగా సంసిద్ధులు అయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో జీసీడీవో శకుంతల, ఏటీడీవో చిరంజీవి, కృష్ణారావు, రవీందర్, ఆర్‌పీలు రవీందర్, భారత్, ఖాలీబ్, నారాయణమూర్తి, అరుణదేవి పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ వినికిడి దినోత్సవం

సిర్పూర్(యు), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సోమవారం ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామీణ మగ ఆరోగ్య కార్యకర్త కుసరం నిలకంఠ్ మాట్లాడుతూ వినికిడి లోపం వల్ల కలిగే అనార్థాలను వివరించారు. ముఖ్యంగా డీజే లాంటి శబ్దాల వద్ద ఎక్కువ సేపు ఉండవద్దని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సోమవారం ఆసిఫాబాద్ పట్టణంలోని అబ్దుల్ కలాం స్కూల్‌లో షీ టీం ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై విద్యార్థులకు షీ టీం ఇన్‌చార్జి ఎస్సై వెంకటేశ్వర్లు, మహిళా ఎస్సై శిరీషలు అవగాహన కల్పించారు. మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్‌క్రైం, వాట్సాప్, ఫేస్‌బుక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, షీ టీం సేవలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సమావేశంలో పాల్గొన్న విద్యార్థినులు

ఆసిఫాబాద్ డీఎంను సస్పెండ్ చేయాలి





కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి వినతి పత్రం అందజేస్తున్న ఆర్టీసీ కార్మికులు , ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథ్ కార్మికులను వేధింపులుకు గురిచేస్తున్నారని ఆయనను సస్పెండ్ చేయాలని కోరుతూ కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్‌కు బీజేపీ నాయకులతో కలిసి కార్మికులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిపోలో కార్మికులపై పనిభారం పెంచి వేధింపులకు గురిచేస్తున్నారని, హైదరా బాద్‌కు వెళ్లే సర్వీసును నడిపితే మూడు రోజుల పని దినాలుగా ఉన్న దానిని రెండు రోజులకు కుదించే కుట్ర చేస్తున్నారని, డ్రంకెన్ డ్రైవ్ పేరుతో పని చేయని మిషన్ ద్వారా పరీక్షించి కార్మికులపై తప్పుడు నివేదికలు ఇచ్చి సస్పెండ్ చేయడం, సర్వీస్ రిమూవల్ చేయడం చేస్తున్నారన్నారు. రెండు సంవత్సరాల్లో 216 మంది కార్మికులను సస్పెండ్, రిమూవల్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ఎం, డీఎంల వేధింపులు ఆపాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఏమాజీ, తిరుపతి, కేఎన్‌రావు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

● కేంద్ర మంత్రిని కలిసిన నాయకులు

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన బీజేపీ నాయకులు సోమవారం కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌ని కలిశారు.

కాగజ్‌నగర్ మండలం ఈసుగాం క్యాంపు పదిలో నూతనంగా గోశాల నిర్మాణ భూమి పూజకు రావాలని నాయకులు బండి సంజయ్ కుమార్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొంగసత్యనారాయణ, గోలెం వెంకటేష్, వీరభద్రచారి, ఆశోక్ ఆర్య, విజయ్‌కుమార్, అరుణ్ కుమార్, సమీర్ గుప్తా, రణవీర్ విశ్వాస్, రితీష్ తదితరులు పాల్గొన్నారు.